సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 12 । ఫిబ్రవరి । 2025



కష్టాల పెట్టుబడి.. నష్టాల దిగుబడి

జిల్లాలో పడమటి మండలాల్లో ఉలవ సాగుపై ఆశలు పెట్టుకొన్న రైతులకు ఈ ఏడాది కన్నీళ్లే మిగిలాయి. ఎంతో కష్టపడి పండించినా దిగుబడి సరిగా రాలేదు. -8లో



వర్గ పోరులో దుకాణాలు ధ్వంసం

మదనపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు మధ్య జరుగుతున్న వర్గ పోరులో దాడులు మొదలయ్యాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.150	రూ.180
రెండోరకం	రూ.90	రూ.146

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 40 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

సౌమ్యనాథ స్వామికి రూ.4,96,388 ఆదాయం

నందలూరు: నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. రూ. 4,96,388లు వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకనెల హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు చెప్పారు.వచ్చిన మొత్తాన్ని బ్యాంకులోని ఆలయ ఖాతాలో జమ చేస్తామని వివరించారు.కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ గురుస్వామి యాదవ్, విజిలెన్స్ అధికారి భాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: మహాశివరాత్రికి శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం సిబ్బందితో గేట్ మీటింగ్ నిర్వహించారు. శైవక్షేత్రాలకు వెళ్లే బస్సులు కండీషన్‌లో పెట్టాలని ఆదేశించారు. ఈపీకే.ఓఆర్‌లో రీజియన్‌లో ప్రథమ స్థానం, కేఎంపీఎల్‌లో రీజియన్‌లో రెండో స్థానంలో ఉన్నాయన్నారు. సిబ్బంది క్రమశిక్షణతో పని చేసి డిపో ఆదాయం పెంచాలన్నారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి,సిబ్బంది పాల్గొన్నారు.

12న డయల్ యువర్ డీఎం: డిపో పరిధిలో సమస్యలు, ఆర్టీసీ ఆదాయం పెంచడానికి ఈనెల 12వతేదీన డయల్ యువర్ డీఎం కార్యక్రమంల నిర్వహిస్తున్నట్లు డీఎం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. 99592 25676 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.


దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి జగదాంబసెంటర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025 -26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో (ఇంగ్లీష్ మీడియం) ప్రవేశానికి బాలురు, బాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుందన్నారు. మార్చి 6వ తేదీలోగా https://apbragcet.apcfss.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 6న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 5వ తరగతికి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి ప్రవేశ పరీక్ష అదే రోజు మధ్యాహ్నం 2 నుండి 4.30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు.

ఎంట్రీఫీజు టెండర్ రూ.19 లక్షలు

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై అటవీశాఖ సముదాయంలోకి ప్రవేశించేందుకు వసూలు చేసే ఎంట్రీఫీజు గుత్త అప్పగించేందుకు నిర్వహించిన టెండర్లలో అత్యధిక ఆదాయం లభించింది. మంగళవారం రాజంపేట డీఎఫ్ఓ కార్యాలయంలో టెండర్ల నిర్వహణ జరిగింది. 2017లో మొదటిసారి ఈ ఎంట్రీఫీజు వసూలును ప్రారంభించారు. అప్పుడు ఎంట్రీ ఫీజు రూ.10 ఉండగా ఆ ఏడాది రూ.6,07,500 లీజు అప్పగించారు. తర్వాత వరుసగా ప్రతిఏటా లీజు విలువ పెరుగుతూ వస్తోంది. 2024లో రూ.14 లక్షలు పలకగా ప్రస్తుతం 2025 ఏడాదికి లీజు అప్పగింతకు బిడ్ విలువ రూ.15.50 లక్షలుగా నిర్ణయించగా టెండర్లలో నలుగురు పాల్గొన్నారు. వీరిలో విజయ్‌కుమార్‌రెడ్డి రూ. 19,00,008తో టెండర్ దాఖలు చేయడంతో లీజు ఆయనకు దక్కింది. అటవీసముదాయంలోని క్యాంటిన్ నిర్వహణకు బిడ్ రూ.1.50 లక్షలు నిర్ణయించగా ఇద్దరు టెండర్లు దాఖలు చేయగా అహ్మద్ సుహైల్ రూ.1,57,800కు టెండర్ దక్కించుకున్నారు. మానస సరోవరంలో బోటింగ్ లీజుకు బిడ్ రూ.10.50 లక్షలు నిర్ణయించగా పాల్గొన్న టెండర్‌దారులు రూ.7 లక్షలకే దాఖలు చేయడంతో ఆ టెండర్‌ను రద్దు చేశారు. బోటింగ్‌కు తిరిగి టెండర్లు నిర్వహిస్తామని డీఎఫ్ఓ జగన్నాథ్‌సింగ్ తెలిపారు.

విద్యార్థుల ఫోన్లకు హాల్‌టిక్కెట్లు



క్రిష్ణయ్య

మదనపల్లె సిటీ: ఇంటర్‌లో ఈసారి గతంలో కంటే మెరుగైన ఫలితాలను సాధించడానికి పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి క్రిష్ణయ్య అన్నారు.మంగళవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ మార్చి 1 నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభంకానున్నాయని, ఈసారి ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి విద్యార్థి ఫోన్ నంబర్‌కు హాల్‌టిక్కెట్టును పంపిస్తామని చెప్పారు. దీనిపై ఎలాంటి అపోహలు అవసరం లేదన్నారు గతంలో ప్రైవేటు కాలేజీలో ఫీజలు చెల్లిస్తేనే హాల్‌టిక్కెట్టు ఇస్తారు, లేకపోతే హాల్‌టిక్కెట్టు ఇవ్వరు అనే ఫిర్యాదులు ఉండవన్నారు. ఈ ఏడాది నూతనంగా ఈ చర్యలు చేపట్టామని తెలిపారు. జిల్లాలో ప్రాక్టికల్స్ పరీక్షలు సీసీ కెమెరాల నిఘా నీడలో జరుగుతున్నాయని, విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించామని చెప్పారు. ఉత్తమ ఫలితాల సాధనకు ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల మేరకు సంకల్ప -25 పేరుతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్టడీ మెటీరియల్ అందజేశాం. అధ్యాపకులకు విద్యార్థులకు దత్తత పేరిట అమలు చేస్తున్నాం. వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.



గూడు.. గోడు

- జగనన్న కాలనీల్లో అనర్హుల పేరుతో ఏరివేతకు సర్కార్ నిర్ణయం
- జిల్లాలో సుమారు 74 వేలకు పైచిలుకు గృహాలు మంజూరు
- ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గృహాల లబ్ధిదారులు



రాయచోటి పరిధిలోని నారాయణరెడ్డిపల్లె లే అవుట్‌లోని గృహాలు (ఫైల్)

సాక్షి రాయచోటి: పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని గూడు లేని ప్రతి నిరుపేదకు ఇల్లు కట్టించేందుకు వైఎస్‌జగన్ సర్కార్ సంకల్పించింది. అర్హులైన వారందరికీ పట్టాలు మొదలుకొని స్థలాలకు సంబంధించి పట్టాలు అందజేసి పేద ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు పయనించింది. కులం, మతం, వర్గం అన్న తేడా లేకుండా ఒకవైపు సంక్షేమ ఫలాలను అందిస్తూ మరోవైపు పేద వారి అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. అయితే కాలంలో మార్పులు రావడం...ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి సర్కార్ అధికారంలోకి రావడంతో పరిస్థితి తారుమారైంది. జిల్లా వ్యాప్తంగా నిరుపేదలకు ఇచ్చిన స్థలాలతోపాటు పక్కా గృహ నిర్మాణాలకు సంబంధించి ప్రత్యేకంగా పరిశీలనకు ఇప్పటి సర్కార్ ముందుకు కదులుతోంది. నిరుపేదల్లో అనర్హుల పేరుతో క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం పట్టాలను రద్దు చేసేందుకు వేగంగా పావులు కదుపుతున్నారు.



ఇల్లు నిర్మించుకోకపోతే పట్టా రద్దు

జిల్లాలోని కాలనీల్లో స్థలాలకు సంబంధించి పట్టాలు తీసుకుని ఇంటి నిర్మాణం ప్రారంభించని పట్టాలను రద్దు చేసే దిశగా అధికార యంత్రాంగం కదులుతోంది. అందుకు సంబంధించి సోమవారం నుంచి 15 రోజులపాటు ప్రత్యేక బృందాలతో కూడిన టీములు నిశిత పరిశీలన చేపట్టాయి. ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఇల్లు నిర్మించుకోలేకపోయిన వారి పట్టాలను రద్దు చేయనున్నారు. ఇప్పటికే ఇంటి పట్టాల రద్దు వ్యవహారంపై కూటమి సర్కార్ గతంలోనే క్లారిటీ ఇచ్చింది. జిల్లాలో ఇంటి పట్టాలు తీసుకుని కారణాలు ఏవైనా ఇప్పటివరకు నిర్మాణాలు మొదలు పెట్టని వారి పట్టాలతోపాటు బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న వాటిని కూడా రద్దు చేయనున్నట్లు తెలుస్తోంది. తద్వారా చాలామంది పేదలకు సంబంధించిన స్థలాలకు ప్రభుత్వం ఎసరుపెట్టేలా కనిపిస్తోందని లబోదిబోమంటున్నారు.

కాలనీల్లో పరిశీలనకు బృందాలు: జిల్లాలోని జగనన్న లే-అవుట్లతోపాటు ఇతర కాల నీల్లో స్థలాల పరిశీలనకు టీములు కదులుతున్నాయి. ప్రధానంగా సర్వేయర్‌తోపాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్వోలతో కూడిన బృందాలు స్థానికంగా ఉన్న కాలనీల్లోకి వెళ్లి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకున్నారా? లేదా?, అలాగే నిర్మించుకున్న వారే ఉంటున్నారా? లేక ఇతరులకు ఇచ్చారా? పట్టాలు తీసుకున్న వారికి సంబంధించి గతంలో ఏవైనా గృహాలు ఉన్నాయా? సొంత వాహనాలు ఉన్న వారు తీసుకున్నారా? ఇల్లు నిర్మించుకోకపోవడానికి కారణాలు, బేస్‌మెంట్ స్థాయిలో నిలబెట్టేందుకు కారణాలు ఇలా అనే అంశాలపై విచారణ చేపట్టనున్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలనతోపాటు విచారణ కార్యక్రమం దాదాపు 15 రోజులపాటు కొనసాగనున్నట్లు అధికారుల ద్వారా తెలియవచ్చింది. ఏది ఏమైనా పేద ప్రజలకు సంబంధించిన పట్టాలు, ఇళ్ల విషయంలో ప్రభుత్వం అనర్హత పేరుతో ఏరివేతకు రంగం సిద్ధం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వైఎస్సార్ సీపీ సానుభూతిపరులే లక్ష్యంగా..

అన్నమయ్య జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లోనూ జగనన్న కాలనీలు రూపుదిద్దుకున్నాయి. పట్టణ ప్రాంతాల్లో అయితే సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో రెండు సెంట్ల చొప్పున అప్పటి ప్రభుత్వం పేదలకు కేటాయించింది. ఎక్కడికక్కడ కేటాయించిన స్థలాలకు సంబంధించి ఒత్తిడి తీసుకొచ్చి ఇల్లు నిర్మించుకునేలా కృషి చేశారు. జిల్లాలోని 513 లే-అవుట్లలో సుమారు 74 వేలకు పైగా ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి సర్కార్ ఎలాగోలా వైఎస్సార్ సీపీ సానుభూతి పరులను, నాయకులను ఇబ్బంది పెట్టే దిశగా అడుగులు పడుతున్నాయి. ఎక్కడికక్కడ ఇల్లు కట్టుకోలేని నిరుపేదలతోపాటు వైఎస్సార్ సీపీకి చెందిన వారు స్థలాలు పొందినట్లయితే వాటిని రద్దు చేయించేలా చర్యలు చేపడుతున్నారు. ప్రధానంగా ఇటీవల రాయచోటి, పీలేరు తదితర ప్రాంతాల్లోని లే అవుట్లపై విస్తృతంగా ఆక్రమణల పేరుతో ప్రచారానికి తెర తీశారు.

ఘనంగా లూర్దుమాత తిరునాల

కడప కల్చరల్: కరుణామయి, ప్రేమమూర్తి ఏసుక్రీస్తును ఈ లోకానికి అందించిన దయగల తల్లి లూర్దుమాత తిరునాల మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం మరియాపురంలోని పాత గుడివద్ద బిషప్, కడప అపోస్థలిక పాలనాధికారి గాలి బాలి సమిష్ఠి బలిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లూర్దుమాత ఆశీస్సులతోనే నవదిన ఉత్సవాలు వైభవంగా నిర్వహించగలిగామని, ఆమెతోపాటు ప్రభువైన ఏసుక్రీస్తుకు దైవానికి కృతజ్ఞతలు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన లూర్దుమాత దర్శనమిచ్చిన సంఘటనలను వివరించి వాక్యపరిచర్య చేశారు. మరియాపురం క్రీస్తు జ్యోతి కాన్వెంట్ ప్రతినిధులు వేదికను, ప్రార్థనా పీఠాన్ని ఆకర్షణీయంగా అలంకరించారు. కడప మేత్రాసనం ఫాదర్లు సంగీత సహకారం, దైవార్చన కార్యక్రమాలను పర్యవేక్షించారు. కడప నగరంలోని డాన్‌బాస్కో ఐటీఐ వద్ద నుంచి భక్తులు మరియమాత స్వరూపాన్ని ఊరేగింపుగా మరియాపురంలోని పాత చర్చి వద్దకు తీసుకొచ్చారు.



లూర్దుమాతస్వరూపానికి పూలమాల వేస్తున్న భక్తురాలు

తిరునాల సందడే సందడి: లూర్దుమాత నవదిన ఉత్సవాల ముగింపు సందర్భంగా పాత చర్చి ఆవరణలో తిరునాల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎద్దులతో బండలాగుడు పోటీలను నిర్వహించారు. విజేతలైన ఎద్ల యజమానులకు అతిథులు బహుమతులు అందజేశారు.



ప్రార్థనలకు హాజరైన విశ్వాసులు

ఏనుగుల దాడిలో అరటితోట ధ్వంసం

ఓబులవారిపల్లె: మండలంలోని గాదెల అటవీ సమీపంలోని అరటి తోటలపై మంగళవారం తెల్లవారుజామున ఏనుగులు దాడి చేశాయి. గాదెల వెంకటాపురం దళితవాడకు చెందిన పెంచలయ్య తోటలో దాదాపు 500 అరటిచెట్లను ధ్వంసం చేశాయి. ఫారెస్టు అధికారులు తోటను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ అటవీ సమీప రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంగళవారం రాత్రి కూడా ఏనుగులు పంట పొలాల వద్దకు రావడంతో వాటిని తరిమేందుకు రైతులు పెద్దఎత్తున శబ్దాలు చేశారు.



ఏనుగులు ధ్వంసం చేసిన అరటి చెట్లు

మార్చి 5 నుంచి ఒంటిమిట్టలో మహాసంప్రోక్షణ

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వారి ఆలయంలో మార్చి 5 నుంచి 9వ తేదీ వరకు మహా సంప్రోక్షణ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు టీటీడీ జేఈఓ వి.వీరబ్రహ్మం తెలిపారు. ఇక్కడ జరుగుతున్న జీర్ణోద్ధరణ మరమ్మతులు, బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై మంగళవారం జేఈఓ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భాలయంలో జీర్ణోద్ధరణ కోసం గత ఏడాది సెప్టెంబర్ 6 నుంచి 8వ తేదీ వరకు బాలాలయం నిర్వహించినట్లు తెలిపారు. సకాలంలో ఆలయ పునరుద్ధరణ పనులను పూర్తి చేయాలని టీటీడీ అధికారులను కోరారు. మార్చి 5 నుంచి 9వ తేదీ వరకు ఆలయంలో మహా సంప్రోక్షణ నిర్వహించి భక్తులకు మూలమూర్తి దర్శనం కల్పించనున్నట్లు తెలియజేశారు. కడప జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకొని స్వామివారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు.



ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బాలాలయంలో జీర్ణోద్ధరణ పనులను పరిశీలిస్తున్న టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం

అనంతరం జేఈఓ కల్యాణ వేదిక వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఈ సత్యనారాయణ, ఎస్ఈ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈఓ పీవీ నటేష్ బాబు, విజీఓ సదాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు సత్వరమే పరిష్కారం చూపాలి

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి: రెవెన్యూ సదస్సులు, పీజీఆర్ఎస్‌లలో వచ్చిన అర్జీల ను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎంఆర్ఓలు, సర్వేశాఖ సిబ్బంది, వీఆర్ఓలతో వీసీ ద్వారా వివిధ అంశాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదన రావు, సబ్ కలెక్టర్లు, ఆర్డీఓ, సర్వేశాఖ ఏడీ, ఎంఆర్ఓలు, రెవెన్యూసిబ్బంది, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

మహిళలు ఆర్థికంగా అభ్యున్నతి చెందాలి

ప్రభుత్వం అందజేస్తున్న రాయితీ రుణాలను పొంది జీవనోపాదులను మెరుగుపరుచుకొని ఎస్సీ మహిళలు ఆర్థికంగా అభ్యున్నతిని సాధించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అన్నారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సెర్ప్, ఎస్సీ కార్పొరేషన్, ఏపీ షెడ్యూల్డ్ క్యాస్ట్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత స్వయం సహాయక సంఘాల్లో ఉన్న ఎస్సీ మహిళలకు కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకం ప్రధాన మంత్రి అను సుచిత్ జాతి అభ్యుదయ యోజన పథకంపై ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా స్వయం సహాయక సంఘాలలో ఉన్న ఎస్సీ మహిళల జీవనోపాధుల మెరుగుదలకు రాయితీతో వడ్డీలేని రుణాలను అందజేస్తున్నామని కలెక్టర్ అన్నారు. అనంతరం మంజూరైన రుణాలను మహిళలకు అందజేశారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మీ, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి దాసరి నాగార్జున, మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీమకే అనుకూలం

తెరపైకి బాలాజీ డివిజన్!

- పెద్దలసభలో కొత్త డివిజన్ అంశం
- రాజ్యసభలో గళం విప్పిన 'మేడా'
- బాలాజీ పై నోరుమెదపని కూటమి ఎంపీలు




బాలాజీ డివిజన్ కేంద్రంగా ప్రతిపాదనలో ఉన్న తిరుపతి రైల్వే స్టేషన్

రాజంపేట: తిరుపతి కేంద్రంగా బాలాజీ డివిజన్ ఏర్పాటు అంశం తెరపైకి వచ్చింది. సౌత్‌కోస్ట్ జోన్ ఏర్పాటుకు హద్దులు తీసుకొచ్చిన రైల్వేబోర్డు తిరుపతి బాలాజీ డివిజన్ ఏర్పాటు గురించి మరిచింది. కూటమి ఎంపీలు నోరు మెదపకపోవడంతో సీమ వాసుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్త జోన్ ఏర్పడిన తరుణంలో కొత్త డివిజన్‌గా ఏళ్ల తరబడి ప్రతిపాదనలో ఉన్న బాలాజీ డివిజన్ ఏర్పాటుపై కూటమి ఎంపీలు ఆలోచన ఏమిటో ప్రజలకు అర్థంకావడంలేదు. తిరుపతి కేంద్రంగా బాలాజీ డివిజన్‌గా చేయాలని సీమ వాసుల నుంచి కేంద్రానికి వినతులు వెళుతున్నాయి.

సీఎం రమేష్ రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా ఉన్నా..

రైల్వేస్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా సీఎం రమేష్ ఉండి కూడా వైఎస్సార్ ఉభయ జిల్లాల రైల్వేల పురోగతికి ఏమీ చేయలేదన్న అపవాదును మూటకట్టుకున్నారు. తిరుపతి కేంద్రంగా బాలాజీ డివిజన్ ఏర్పాటు, నందలూరు రైల్వేకు పూర్వవైభవం, కొత్తరైళ్లు, కడప- బెంగళూరులైన్ పురోగతి, కృష్ణపట్నం లైన్‌లో ప్యాసింజర్ రైలును నడిపించలేకపోయారనే విమర్శలున్నాయి.



గుంతకల్‌కు వెళ్లాలంటే దూరభారం....

తరుచూ సమావేశాలకు గుంతకల్ డివిజన్ కేంద్రానికి వెళ్లి రావాలంటే అధికారులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతకల్, గుంటూరు, విజయవాడ నాలుగు డివిజన్లతోపాటు కొత్తగా బాలాజీ డివిజన్ ఏర్పాటుచేసి విశాఖజోన్‌లో కలిపితే బాగుంటుందని రైల్వే నిపుణులు అంటున్నారు.

బాలాజీ డివిజన్ ఏర్పాటైతే..

బాలాజీ డివిజన్ ఏర్పాటైతే తిరుపతి-గూడూరు (92.96కిమీ), తిరుపతి-కాట్పాడి (104.39కిమీ),పాకాల-మదనపల్లి (83కిమీ), రేణిగుంట-కడప (125కిమీ)లైన్ కలిపే అంశాన్ని గతంలోనే రైల్వే అధికారులు పరిశీలించారు. కాగా జిల్లా మీదుగా వెలుగొండ అడవుల్లో నుంచి వెళ్లే కృష్ణపట్నం రైల్వే లైన్ కూడా విజయవాడ డివిజన్‌లోకి వెళ్లింది.

ఆ దిశగా ఎంపీలు రైల్వే మంత్రిత్వశాఖపై ఒత్తిడి తీసుకురావాలని సీమవాసులు కోరుతున్నారు.

కొత్తడివిజన్ ఏర్పడితే నందలూరుకు పూర్వ వైభవం..

కొత్త డివిజన్ ఏర్పడితే బ్రిటీషు కాలం నాటి రైల్వే కేంద్రానికి పూర్వవైభవం సంతరించుకుంటుంది. బాలాజీ డివిజన్ కేంద్రానికి దగ్గరలో ఉన్న రేణిగుంట జంక్షన్ తర్వాత నందలూరు రైల్వేకేంద్రం ప్రాముఖ్యత కలిగివుంది. డివిజన్‌కు రైల్వే ప్రత్యామ్నాయ పరిశ్రమను ఏర్పాటుచేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. గతంలో రైల్వేమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ స్వయంగా రాజ్యసభలో నందలూరులో రైల్వేపరిశ్రమ ఏర్పాటు గురించి ప్రకటించిన సంగతి తెలిసిందే. రైల్వేపరిశ్రమ వస్తే గుంతకల్‌కు ప్రాధాన్యత తగ్గిపోతుందని రైల్వే ఉన్నతాధికారులు భావించినట్లు తెలిసింది. విశాఖ జోన్ ఏర్పడిన నేపథ్యంలో గుంతకల్ డివిజన్ నుంచి వేరుచేసి కడప (ఉభయజిల్లాలు) వరకు బాలాజీ డివిజన్‌గా ఏర్పాటుచేసే ప్రతిపాదన కార్యరూపం దాల్చేందుకు పాలకులు నడుం బిగించాల్సి అవశ్యకత ఉందని రైల్వే నిపుణులు చెబుతున్నారు.

రాజ్యసభలో బాలాజీ డివిజన్ ఏర్పాటు అంశం

వైఎస్సార్, అన్నమయ్య, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల ఎంపీలు బాలాజీ డివిజన్ ఏర్పాటు అంశం రాజ్యసభలో ప్రస్తావనకు తీసుకొచ్చారు. ఎంపీ మేడా రఘునాథరెడ్డి రాయలసీమ కేంద్రంగా తిరుపతి బాలాజీ డివిజన్ ఏర్పాటు చేయాలని సభలో ప్రసంగించారు. అలాగే రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తిలు కూడా బాలాజీ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరిన సంగతి తెలిసిందే.

ప్రధాన రైలుమార్గాలు

- ముంబై-చెన్నై
- ఎర్రగుంట్ల-నంద్యాల
- ఓబులవారిపల్లె-కృష్ణపట్నం
- కడప-బెంగళూరు

సర్వేలు

- ముదిగుబ్బ-ముద్దనూరు
- భాకరాపేట-గిద్దలూరు
- కంభం-ప్రొద్దుటూరు


అందరికీ ఉపయోగకరం



బాలాజీ డివిజన్ ఏర్పాటు ఎంతైనా అవసరం. విశాఖజోన్ ఏర్పడుతున్న క్రమంలో కొత్త డివిజన్లను ఏర్పాటు చేయాల్సి వస్తే అది ముందుగా బాలాజీ డివిజన్ ఉంటుందని భావిస్తున్నాను. ఇందుకు అన్ని అర్హతులు బాలాజీ డివిజన్‌కు ఉన్నాయని రైల్వే నిపుణులు భావన. ఇది అందరికీ ఉపయోగకరం. కేంద్ర రైల్వేమంత్రిత్వశాఖ ఆ దిశగా అడుగులు వేయాలని కోరుతున్నాను.

–పీవీ మిథున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట

దశాబ్దాల కాలం నాటి ప్రతిపాదన



రాయలసీమ కేంద్రంగా బాలాజీ డివిజన్ ఏర్పాటు చేయడం అనుకూలం. ఈ ప్రతిపాదన దశాబ్దాల కాలం నాటిది. గతంలో కూడా దీనికి సంబంధించి పరిశీలనలు కూడా జరిగాయి. బాలాజీ డివిజన్ ఏర్పాటు అమలుచేయాలని పెద్దలసభలో చర్చించాను. కొత్త డివిజన్ ఏర్పాటు వల్ల నందలూరు రైల్వేకు పూర్వవైభవం వస్తుంది.

–మేడా రఘునాథరెడ్డి, రాజ్యసభ సభ్యుడు

పోలీసుల దాష్టీకం

ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే ఇదేనా?



గాయపడిన శివప్రసాద్

సాక్షి, టాస్క్‌ఫోర్స్: అన్నమయ్య జిల్లా పుల్లంపేట భార్యాభర్తల గొడవలో భర్త శివప్రసాద్‌ను పోలీసులు విచక్షణా రహితంగా చితకబాదారు. ఒళ్లంతా లాఠీ దెబ్బలతో కందిపోయింది. మండల కేంద్రానికి చెందిన బాధితుడు బొమ్మిశెట్టి శివప్రసాద్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తనకు, తన భార్య మాధురికి స్వల్ప ఘర్షణ జరిగిందని, దీంతో ఆమె 100కు డయల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పుల్లంపేట పోలీసులు మంగళవారం తెల్లవారుజామున తనను కొట్టుకుంటూ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. లాఠీ విరగడంతో డ్రిప్పు పైపుతో సైతం విపరీతంగా కొట్టారు. తనకు ఆపరేషన్ జరిగిందని, కాళ్లలో రాడ్లు వేశారని కాళ్లు పట్టుకుని బతిమలాడినా వదలకుండా ముఖంపై బూటు కాలుతో తన్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.. ప్రభుత్వం ఫ్రెండ్లీ పోలీసు అంటున్నా..క్షేత్రస్థాయిలో పోలీసుల తీరు చూస్తే ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే ఇదేనా అంటూ ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. బాధితుడిని అఖిలపక్ష నాయకులు పరామర్శించారు. పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తనపై విచక్షణారహితంగా దాడి చేసిన పోలీసులపై హోంమంత్రి చర్యలు తీసుకోవాలని శివప్రసాద్ డిమాండ్ చేశాడు.

క్లుప్తంగా

ఉపాధి పని వంద రోజులు కల్పించాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

రామాపురం : జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీలకు వంద రోజులు పని కల్పించాలని అన్నమయ్య జిల్లా ఉపాధి పీడీ వెంకటరత్నం అన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లె గ్రామంలో ఉపాధి పనులను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నల్లగుట్టపల్లి గ్రామంలో 64 మంది కూలీలు పని చేస్తున్నారని తెలిపారు. నాణ్యతగా ఉపాధి పనులు చేపట్టాలన్నారు. జిల్లాలో 58 వేల మంది కూలీలు పని చేస్తున్నారని, జిల్లా వ్యాప్తంగా రైతులు 38 వేల ఎకరాలలో పండ్ల తోటలను 2024–25 సంవత్సరంలో పెంచుతున్నారని, ఇంకా ఎవరైనా అర్హులైన రైతులు ఉంటే పండ్ల తోటలను పెంచుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పెంచలయ్య, ఈసీ శివయ్య, టీఏలు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలతో ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న జిల్లా రవాణాశాఖ అధికారి ప్రసాద్

రాజంపేట : రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయని జిల్లా రవాణాశాఖ అధికారి ప్రసాద్ తెలిపారు. స్థానిక అన్నమాచార్య యూనివర్సిటీలో మంగళవారం 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని సకాలంలో సమీపంలో ఉన్నటువంటి ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రభుత్వం అందించే గుడ్ సమా రిటర్న్ పారితోషకం రూ.5 వేలు పొందాలన్నారు. అడిషనల్ ఎస్పీ మనోజ్ కుమార్‌హెగ్డే మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మనోధైర్యంతో ఉండాలని, ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన ఉండకూడదని సూచించారు. విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ, రాజంపేట మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్, మన్నూరు సీఐ అలీ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసు ఛేదన

అట్లూరు : మండలంలోని ఎగువపల్లి కాలనీలో గతేడాది డిసెంబర్ 6న జరిగిన చోరీ కేసుకు సంబంధించి రికవరీ చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అట్లూరు పునరావాస కాలనీలోని ఎగువపల్లి కాలనీలో చెల్లాకొండయ్య ఇంటిలో డిసెంబర్ 6వ తేదీన చోరీ జరిగిందని పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు చెప్పారు. కొండయ్య సమీప బంధువైన మైనర్ బాలుడిని మంగళవారం అదుపులోకి తీసుకుని, జువైనల్ జస్టిస్ బోర్డుకు పంపడం జరిగిందని తెలిపారు.

కష్టాల పెట్టుబడి.. నష్టాల దిగుబడి

- నిరాశ మిగిల్చిన ఉలవ సాగు
- తగ్గిన పంట దిగుబడి
- ధర భారీగా పతనం
- కుదేలైన రైతు



పొలంలో ఉలవ పంటను కోసి వేసిన కుప్పలు



పంట నూర్పిళ్లు చేస్తున్న రైతులు

గుర్రంకొండ : ఉలవ సాగుపై ఆశలు పెట్టుకొన్న రైతులకు ఈ ఏడాది కన్నీళ్లే మిగిలాయి. ఎంతో కష్టపడి పండించినా దిగుబడి సరిగా రాలేదు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర కూడా లభించకపోవడంతో భారీగా నష్టపోయారు. జిల్లాలో ముఖ్యంగా పడమటి మండలాల్లో వేరుశనగ అదును దాటిపోయిన తరువాత.. ప్రత్యామ్నాయ పంటగా ఉలవ సాగును రైతులు ఎంచుకొంటారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతోపాటు విభిన్న వాతావరణ పరిస్థితుల కారణంగా.. దిగుబడి భారీగా తగ్గింది.

జిల్లాలో 16250 ఎకరాల్లో సాగు

జిల్లాలో ఈ ఏడాది 16250 ఎకరాల్లో ఉలవ సాగు చేశారు. ఆగస్టు నెల నుంచి ఈ పంట సాగుపై దృష్టి సారిస్తారు. సెప్టెంబర్, అక్టోబర్‌లో సాగు ప్రారంభమవుతుంది. జనవరి, ఫిబ్రవరిలో నూర్పిళ్లు ఉంటాయి. దుక్కుల దగ్గర నుంచి ఉలవలు పొలంలో చల్లే వరకు ఒక ఎకరానికి రూ.10 వేల వరకు ఖర్చు వస్తుంది. విత్తనాలు చల్లినప్పటి నుంచి పంట కోత కోసే వరకు ఎటువంటి ఎరువులు, కూలీల ఖర్చు ఉండదు. పంట కోత కోయడానికి మాత్రమే కూలీల ఖర్చు వస్తుంది. సాధారణంగా సాగు ప్రారంభమైన తరువాత రెండు నెలల పాటు సక్రమంగా వర్షాలు కురిస్తే హెక్టారుకు 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

35 శాతానికి పడిపోయిన దిగుబడి

గతేడాదితో పోల్చితే ఈ ఏడాది 35 శాతం దిగుబడి మాత్రమే వచ్చింది. గతేడాది సగటున ఎకరానికి 3 నుంచి 5, అత్యధికంగా 7 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి రావడం గమనార్హం. ఈ ఏడాది విభిన్న వాతావరణ పరిస్థితులు, అదను దాటి కురిసిన వర్షాల కారణంగా సగటున ఎకరానికి రెండు నుంచి రెండున్నర క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో రెండు అదనులుగా పంట సాగు చేసిన రైతులు విభిన్నమైన దిగుబడులు సాధించడం గమనార్హం. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్, డిసెంబర్‌లో కురిసిన చెదురుమదురు వర్షాలు, విభిన్న వాతావరణ పరిస్థితుల కారణంగా పంట దిగుబడిలో తేడా కనిపించింది. సెప్టెంబర్‌లో సాగు చేసిన రైతులకు ఎకరానికి మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల దిగుబడి చేతికందింది. అక్టోబర్‌లో వేసిన పంటలు ఒకటి నుంచి ఒకటిన్నర క్వింటాళ్ల దిగుబడి వచ్చింది.

కిలో రూ.34 నుంచి 35 మాత్రమే

ఉలవ ధరలు ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ.34 నుంచి రూ.35 వరకు పలుకుతున్నాయి. గతేడాది రూ.57 నుంచి రూ.60 వరకు పలికాయి. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది దాదాపు 50 శాతం ధరలు తగ్గిపోవడం గమనార్హం. ఈ ఏడాది ఎకరానికి రెండు నుంచి రెండున్నర క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ లెక్కన ఎకరానికి రూ.7 వేల నుంచి రూ.8750 వరకు రైతుకు చేతికి అందింది. గతేడాది ఎకరానికి ఏడు నుంచి ఎనిమిది క్వింటాళ్ల దిగుబడి రాగా.. కిలో రూ.57 నుంచి రూ.60 వరకు ధర పలికింది. ఈ లెక్కన ఎకరానికి అత్యధికంగా రూ.60 వేలు వచ్చింది. ఈ ఏడాది రూ.8750 మాత్రమే రావడం గమనార్హం. దీంతో ఎకరానికి రూ.50 వేలకు పైగా తగ్గింది.

నష్టపోయిన వ్యాపారులు

గతేడాది ఉలవల వ్యాపారం లాభాలు తెచ్చిపెట్టడంతో.. వ్యాపారస్తులు అప్పట్లో ఎగబడి కొనుగోలు చేశారు. రెండేళ్ల కిందట వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వ్యాపారులు కిలో రూ.40 నుంచి రూ.45కే రైతుల వద్ద నుంచి కొనుగోలు చేశారు. అప్పట్లో కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ ఉంచారు. సీజన్ ముగిశాక ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు ఉలవలను పంపిణీ చేయడం కోసం.. వ్యాపారస్తుల నుంచి కొనుగోలు చేసింది. గతేడాది ప్రభుత్వం వ్యాపారస్తుల నుంచి కిలో రూ.108కు కొనుగోలు చేసింది. దీంతో వారికి కిలోపై రూ.68 నుంచి 63 వరకు ఆదాయం వచ్చింది. దీంతో గతేడాది వ్యాపారులు ఉలవలపై ఎక్కువగా దృష్టి సారించి భారీ ఎత్తున కొనుగోలు చేసి కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ ఉంచారు. గతేడాది కిలోకు రూ.60 వరకు చెల్లించి భారీ ఎత్తున స్టాకు ఉంచారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ ఏడాది మన రాష్ట్రంలో కోల్డ్ స్టోరేజీల్లో వ్యాపారులు నిల్వ ఉంచిన ఉలవలను కొనుగోలు చేయలేదు. కర్ణాటకలో తక్కువ ధరకు కూటమి ప్రభుత్వం కొనుగోలు చేసి.. మన రాష్ట్రంలోని రైతులకు సబ్సిడీపై పంపిణీ చేసింది. దీంతో వ్యాపారులు భారీగా నష్టపోయారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ.35 మాత్రమే ఉంది. దీంతో కోల్డ్‌స్టోరేజీల్లో స్టాకు ఉంచుకొన్న వ్యాపారులు సగటున కిలోపై రూ. 25 వరకు నష్టపోయారు. దీనికి తోడు కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ ఉంచిన దానికి చెల్లించిన డబ్బులు అదనంగా చేతి నుంచి పడుతున్నాయని వ్యాపారులు లబోదిబో మంటున్నారు. ఈ లెక్కన వ్యాపారులు కిలోకి రూ.30పైగానే నష్టపోయారు.

ఉలవ సాగుతో నష్టపోయాం



ఈ ఏడాది ఉలవ పంట సాగు చేసి భారీగా నష్టపోయాం. నేను రెండు ఎకరాల్లో ఈ పంట వేశాను. వర్షాలు, వాతావరణ మార్పుల కారణంగా.. సాగుకు ఖర్చు చేసిన పెట్టుబడి కూడా ఈ ఏడాది రాలేదు. నాలుగు నెలల పాటు పడిన కష్టం నేల పాలైంది. గత ఏడాదితో పోల్చితే 35 శాతం దిగుబడి తక్కువగా వచ్చింది. ధరలు సగానికి పడిపోయాయి. దీంతో రైతులు భారీగా నష్టపోయారు.

- యల్లప్ప, రైతు, ఎస్.కొత్తపల్లె, గుర్రంకొండ మండలం

ప్రభుత్వం కొనుగోలు చేయలేదు



ఈ ఏడాది కోల్డ్‌స్టోరేజీల్లో మేము నిల్వ ఉంచిన ఉలవలను కూటమి ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. గతేడాది జగనన్న ప్రభుత్వం మా వద్ద ఉలవలను కొనుగోలు చేసి రైతులకు సబ్సిడీపై ఇచ్చింది. గతేడాది కిలో ఉలవపై మేము రూ.68 వరకు లాభం పొందాము. ప్రస్తుత మార్కెట్లో కిలో రూ.35 మాత్రమే ధర ఉన్న కారణంగా భారీగా నష్టపోయాము. కిలో ఉలవపై రూ.30 వరకు నష్టం వచ్చింది.

- కృష్ణయ్య, వ్యాపారి, దిగువపల్లె, గుర్రంకొండ మండలం

ల్యాండ్ కన్వర్షన్ స్థలం పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ జాన్‌ఇర్విన్

సిద్దవటం : సిద్దవటం సమీపంలోని సర్వే నంబర్ 378, 370, 574/1, 574/2లో భూమిని ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకోగా కడప ఆర్డీఓ జాన్‌ఇర్విన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్ఎస్ఆర్, 1బి వంటి రికార్డులను తనిఖీ చేశారు. భూమికి సంబంధించిన సరిహద్దులను పరిశీలించారు. అంతే గాకుండా భూమికి ఆనుకొని ఉన్న వంక ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిద్దవటం ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత సోమవారం మాట్లాడుతూ సిద్దవటం రెవెన్యూ పొలం సర్వే నంబర్ 378, 370, 574/1, 574/2లో ఆర్డీఓ పరిశీలించి భూమికి సంబంధించిన ఆర్ఎస్ఆర్ రికార్డులు, హద్దులను తనిఖీ చేశారన్నారు. వారు కొనుగోలు చేసిన పట్టా భూమిలో ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని, ఎటువంటి అక్రమాలు జరగలేదన్నారు. భూమికి సంబంధించి పత్రాలను పరిశీలించామన్నారు. రెవెన్యూ హద్దుల ప్రకారమే భూమిని చదును చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయం ఏఓ శంకర్‌రావు, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో కేశవులు, సర్వేయర్‌లు పాల్గొన్నారు.

13న తలనీలాల వేలం

గోపవరం : మండలంలోని మల్లెంకొండేశ్వర స్వామి ఆలయంలో తలనీలాల సేకరణ కోసం ఈ నెల 13వ తేదీన వేలంపాట నిర్వహించనున్నట్లు దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి ఎస్.రామలింగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తలనీలాల సేకరణకు ఈ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బద్వేలు దేవదాయ శాఖ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు వివరించారు.

జనసేన నేత ఆత్మహత్య ప్రకటన కలకలం

- వీడియో విడుదల చేసిన అస్లాం
- అతన్ని కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు



స్టేషన్‌లో సి.అస్లాం, అతని కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి

కలికిరి : జనసేన పార్టీకి చెందిన ఓ వ్యక్తి చేసిన మోసం వల్ల తాను అప్పులపాలై ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నానని కలికిరి మండల జనసేన అధ్యక్షుడు సి.అస్లాం మంగళవారం ఉదయం వీడియో విడుదల చేశాడు. ఈ సంఘటన జిల్లాలో కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. సి.అస్లాం కేవీపల్లి, కలకడ మండలాలకు చెందిన మరికొందరి జనసేన నాయకులతో కలిసి మదనపల్లికి చెందిన జనసేన కార్యకర్త దారం హరి ద్వారా.. హైదరాబాద్‌కు చెందిన అపర్ణ ఓవర్సీస్ కంపెనీ నుంచి మదనపల్లి, పీలేరు నియోజకవర్గాల పరిధిలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఇందుకు రూ.12.10 లక్షలు వెచ్చించాడు. మధ్యవర్తికి మరికొంత ముట్టచెప్పినట్లు తెలిపాడు. రెండు నెలలుగా సుమారు 40 మంది సిబ్బందితో పనులు చేయగా కంపెనీ నుంచి ఎటువంటి బిల్లులు అందలేదు. దీంతో సిబ్బందికి వేతనాలు, పెట్టుబడి పెట్టిన సహచరులకు డబ్బు ఇవ్వలేక ఇబ్బంది పడుతున్నట్లు వీడియోలో పేర్కొన్నాడు. అంతేకాకుండా తాను మోసపోయానని, నమ్మి పెట్టుబడి పెడితే సొంత పార్టీ వారే మోసగించడం జీర్ణించుకోలేక, ఇతర పార్టీల నుంచి జనసేనలోకి వచ్చిన వారికి గుర్తింపునిస్తున్నారు తప్ప కష్టపడ్డ తనకు తగిన గుర్తింపు దక్కడం లేదనే మనోవేదనతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు కన్నీటి పర్యంతమయ్యాడు. సోషల్ మీడియాలో ఆ వీడియో వైరల్ కావడంతో జిల్లా పోలీసు ఉన్నతాధికారుల దృష్టికెళ్లింది. స్పందించిన వారు అతని ఆచూకీ కనుక్కొని కాపాడాలని కలికిరి సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డిని ఆదేశించారు. దీంతో ఉదయం నుంచి సీఐ ఆధ్వర్యంలో మూడు బృందాలుగా గాలింపు చర్యలు చేపట్టారు. జిల్లా కేంద్రం నుంచి డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి ఆచూకీ కోసం గాలించారు. చివరకు జేఎన్టీయూ కళాశాల సమీపంలో ఉన్నట్లు మొబైల్ సిగ్నల్‌తో గుర్తించారు. అతన్ని స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ అనంతరం రాత్రి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సూచిక బోర్డులు.. నేలపాలు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో సీతారాముల ఎదుర్కోలు మండపాల ప్రత్యేకతను తెలిపే సూచికబోర్డులు నేలపాలయ్యాయి. అవి దుమ్ముధూళి పట్టి ఉన్నాయి. అయినా టీటీడీ అధికారులు పట్టించుకోక పోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తిరుమల–తిరుపతి దేవస్థానం జేఈఓ వీరబ్రహ్మం మంగళవారం ఒంటిమిట్ట రామాలయాన్ని సందర్శించారు. టీటీడీ ఉన్నతాధికారులు సందర్శనకు వచ్చిన సందర్భంలోనూ.. ఈ బోర్డులను పరిశీలించక పోవడంపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక దేవాలయ, టీటీడీ అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి.. సూచికబోర్డులను పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు.



దేవాలయంలో కింద ఉన్న సూచిక బోర్డులు

భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

రూ.5 వేల జరిమానా



పోలీసుల అదుపులో నిందితుడు ధనుంజయ

రాయచోటి టౌన్/రామాపురం : భార్యను అత్యంత కిరాతకంగా హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదుతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ రాయచోటి జిల్లా 5వ అదనపు న్యాయమూర్తి కృష్ణన్‌కుట్టి తీర్పు వెలువరించారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా రామాపురం మండలం నల్లగుట్టపల్లెకు చెందిన మీనుగ ధనంజయ సంబేపల్లె మండలం పరిధిలోని ఉడుం భద్రయ్య మొదటి కుమార్తె మీనుగు పెద్ద రెడ్డెమ్మను వివాహం చేసుకున్నాడు. వివాహ సమయంలో ఏడు తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు తీసుకున్నాడు. అయితే దురలవాట్లకు బానిసై అదనపు డబ్బు కావాలని వేధిస్తూ ఉండటంతో ఆమె అప్పుడప్పుడు పుట్టింటికి వెళ్లి పలు దఫాలుగా రూ.4 లక్షల డబ్బులు తీసుకొచ్చి తన భర్తకు ఇచ్చింది. అయినా ఆశ తగ్గక పోవడంతో మరింత వేధించడం మొదలు పెట్టారు. చివరికి డబ్బులు తీసుక రావాలని బెదిరించడంతో ఆమె అందుకు అంగీకరించలేదు. దీంతో కోపోద్రేకుడైన మీనుగ ధనుంజయ 2017 ఫిబ్రవరి 27న రాత్రి 9 గంటల సమయంలో తలపై కర్రతో బలంగా మోదడంతో ఆమె మృతి చెందింది. దీనిపై అప్పటి రామాపురం ఎస్ఐ కృష్ణమూర్తి ఐపీఎస్ 302, 498 (ఏ), 304, ఆర్/డబ్ల్యూ34, ఐపీసీ అండ్ సెక్షన్ 3 అండ్ 4 డీపీ యాక్టు ప్రకారం కేసు నమోదు చేశారు. దీనిని విచారణ సాగించిన న్యాయవాదులు మంగళవారం కేసు వివరాలు వెల్లడించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు జరిమానా విధిస్తూ జిల్లా 5వ అదనపు న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ముద్దాయికి శిక్ష పడే విధంగా విశేష కృషి చేసిన రామాపురం ఎస్ఐ, లక్కిరెడ్డిపల్లె సీఐలతోపాటు ఇతర పోలీస్ అధికారులకు అభినందించారు.

వర్గ పోరులో టీడీపీ నాయకుల దుకాణాలు ధ్వంసం

- మంత్రి నారా లోకేష్ కటౌట్‌లోని శ్రీరామ్ చినబాబు ఫొటో చించివేత
- కూటమి పాలనలో టీడీపీ నాయకులే బాధితులు
- అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగుల దౌర్జన్యకాండ
- ఎమ్మెల్యే అనుచరులే చేశారని ఆరోపించిన తెలుగు యువత అధ్యక్షుడు



గుర్తుతెలియని దుండగుల దాడిలో ధ్వంసమైన టీడీపీ నాయకుల దుకాణాలు



మంత్రి నారా లోకేష్ కటౌట్‌లో ఉన్న శ్రీరామ్ చిన్నబాబు ఫొటోలు చించివేసిన దృశ్యం

మదనపల్లె : మదనపల్లి నియోజకవర్గంలో టీడీపీ వర్గ పోరు ముదిరి పాకాన పడింది. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు మధ్య జరుగుతున్న వర్గ పోరులో దాడులు మొదలయ్యాయి. శ్రీరామ్ చినబాబు మద్దతుదారులైన నాయకుల దుకాణాలను, కొందరు గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి ధ్వంసం చేశారు. అంతేకాకుండా ఎన్టీఆర్ సర్కిల్లో ఏర్పాటు చేసిన మంత్రి నారా లోకేష్ కటౌట్‌లోని రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు ఫొటోను చించి వేశారు. రాజకీయంగా తమను బెదిరించేందుకే దాడులు చేశారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే అనుచరులే ఈ దుశ్చర్యలకు పాల్పడ్డారని శ్రీరామ్ చినబాబు ఆరోపించారు. మంగళవారం ఉదయం సంఘటన స్థలాలకు చేరుకుని విచారణ చేసిన డీఎస్పీ కొండయ్య నాయుడు, టూ టౌన్ సీఐ రామచంద్ర గొడవలు జరగకుండా నిరోధించేందుకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. దాడి ఘటనపై బాధితులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని నీరుగట్టువారిపల్లె పురాణం భవనంలో నివాసం ఉంటున్న టి. సుదర్శన్‌రెడ్డి (38) టీడీపీ రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షుడిగా పని చేస్తున్నాడు. అదే ప్రాంతంలో రాజానగర్ ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో బ్యూటీ పార్లర్, స్టూడియో, ఫ్యాన్సీ అండ్ గిఫ్ట్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఇదే కాంప్లెక్స్‌లో మరో టీడీపీ నాయకుడు నియోజకవర్గ కార్యదర్శిగా పని చేస్తున్న వెంకటరమణ నాయుడు డీవీఆర్ సిల్క్స్ పేరుతో మరో దుకాణం నిర్వహిస్తున్నాడు. వీరు రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు మద్దతుదారులుగా ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. సోమవారం రాత్రి కూటమి నాయకులు శ్రీరామ్ చినబాబు, గంగారపు రాందాస్‌చౌదరి, బండి ఆనంద్‌లు ఓ యూట్యూబ్ చానల్ లో డిబేట్ కోసం వెళ్లారు. అదే సమయానికి అక్కడ ఎమ్మెల్యే వర్గీయులు పెద్ద సంఖ్యలో గుమికూడారు. విషయం తెలుసుకున్న శ్రీరాం చినబాబు అనుచరులు పెద్ద సంఖ్యలో అక్కడికి రావడంతో, అప్రమత్తమైన టూటౌన్ పోలీసులు దాడులు జరగకుండా ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం దుకాణానికి వెళ్లిన సుదర్శన్‌రెడ్డి గుర్తుతెలియని వ్యక్తులు చేసిన విధ్వంసాన్ని గమనించి సహచర దుకాణ యజమాని వెంకటరమణనాయుడుకు, టూ టౌన్ పోలీసులకు, తమ వర్గ టీడీపీ నాయకులకు సమాచారం అందించారు. దీంతో డీఎస్పీ కొండయ్య నాయుడు, 2 టౌన్ సీఐ రామచంద్ర, ఎస్సై రహీముల్లా సంఘటన స్థలానికి చేరుకుని, దుకాణల ధ్వంసానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. దుకాణాల ధ్వంసం ఘటనలో సుదర్శన్‌రెడ్డికి చెందిన దుకాణంలో రూ.5 లక్షల విలువైన ఐదు లైటింగ్ బోర్డులు, మూడు సీసీ కెమెరాలు, 5 బ్యానర్లు, వెంకటరమణ నాయుడుకి చెందిన షాపులో రూ. 1.40 లక్షల విలువైన వస్తువులు ధ్వంసం అయ్యాయని టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుండగులు విచ్చలవిడిగా తమ దౌర్జన్యకాండ సాగించి ఇనుపరాడ్లతో విలువైన వస్తువులను పగలగొట్టారని ఫిర్యాదు లో పేర్కొన్నారు. రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు బాధితుల్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుదర్శన్ రెడ్డి కష్టకాలంలోనూ తనతో ఉన్నాడన్నారు. ఎమ్మెల్యే వర్గీయులు తన మద్దతుదారులను బెదిరించడానికి దుకాణాలను ధ్వంసం చేశారని ఆరోపించారు. ఎవరైతే ఈ దుశ్చర్యలకు పాల్పడ్డారో వారిని వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలన్నారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఈ ఘటనపై డీఎస్పీ కొండయ్య నాయుడు మాట్లాడుతూ ఇటీవల జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామన్నారు. రాజకీయంగా ఇరువర్గాలు ఒకరిపై ఒకరు పై చేయి సాధించడానికి, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసుకుంటున్నారన్నారు. దుకాణాల ధ్వంసం అంశాన్ని సీరియస్‌గా పరిగణిస్తున్నామన్నారు. నిందితులపై నాన్‌బెయిలబుల్ సెక్షన్లతో కేసులు నమోదు చేస్తామన్నారు. అవసరమైతే బాధ్యులైన వారిపై పిడి యాక్ట్ ప్రయోగిస్తామన్నారు. అంతర్గత రాజకీయ విభేదాలు ప్రజల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకునేది లేదన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీలో పేరు నమోదు చేయించుకోవాలి




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్

వీరబల్లి: ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో పేరు నమోదు చేయించుకోవాలని అన్నమయ్య జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ తెలిపారు. సానిపాయి పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీలో పేరు ఉంటే ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకం అందడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నేతి ఆంజనేయులు, మండల వ్యవసాయశాఖ అధికారిణి స్వాతి, రైతు భరోసా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రం పరిశీలన

రామాపురం : మండలంలోని నల్లగట్టుపల్లె రైతు సేవా కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అందుబాటులో ఉన్న రైతు భరోసా కేంద్రానికి వెళ్లి ఈ నెలాఖరు లోపు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగమణి, ఏఈఓ కవిత, రైతు సేవ కేంద్రం సిబ్బంది లక్ష్మీదేవి, రైతులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో ముందుంటాం



అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, సీఎంఓ సాయి రమేష్

కమలాపురం : తమ పరిశ్రమ కేవలం వ్యాపార ధోరణిలో మాత్రమే కాకుండా.. సామాజిక సేవలో సైతం ముందు ఉంటుందని భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్(బీసీసీపీఎల్) సీఎంఓ సాయి రమేష్ తెలిపారు. ఎర్రగుడిపాడులో ఆధునికీకరించిన అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన మంగళవారం ఐసీడీఎస్ పీడీ శ్రీ లక్ష్మీతో కలసి ప్రారంభించారు. అలాగే సీహెచ్ఎఫ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో కమలాపురం పట్టణంలోని 14వ వార్డు 4వ సెంటర్, 2వ వార్డు అంగన్వాడీ కేంద్రాలను సైతం పరిశ్రమ ప్రతినిధులతో కలిసి ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్లలో అన్ని వసతులు సమకూరుస్తున్నామన్నారు. ప్రస్తుతం 4 సెంటర్లలో పనులు పూర్తి అయ్యాయని, మరికొన్ని సెంటర్లు పూర్తి కావాల్సి ఉందన్నారు. వాటిని కూడా త్వరలోనే పూర్తి చేసి విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, బీసీసీపీఎల్ ఐఆర్అండ్‌పీఆర్ హెచ్ఓడీ భార్గవ్‌రెడ్డి, సీఎస్ఆర్ హెచ్ఓఆర్ నితీష్ కుమార్, సీహెచ్ఎఫ్ ఇండియా ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ చంద్ర శేఖర్, మదన్, అంజిబాబు, సీడీపీఓ సుజామణి, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.